# గులాబీ శ్రేణుల్లో జోష్

- గుర్రంపోడు, హాలియా సభల విజయవంతంతో కార్యకర్తల్లో ఉత్సాహం
- నియోజకవర్గ వ్యాప్తంగా ప్రచారంలో దూకుడు
- ఎమ్మెల్యే భగత్ ప్రచారానికి ప్రజల నుంచి సంపూర్ణ మద్దతు

హాలియా, అక్టోబర్ 30 : నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణుల్లో కొత్త ఉత్సాహం వచ్చింది. ఇటీవల గుర్రంపోడు, హాలియాలో నిర్వహించిన సభలు విజయవంతం కావడం, ఆయా సభలకు జనం భారీగా తరలిరావడంతో పార్టీ కార్యకర్తల్లో జోష్ పెరిగింది. దాంతో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పూర్తిస్థాయిలో ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్, పార్టీ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జీలు సైతం గెలిపే లక్ష్యంగా ప్రచారానికి వ్యూహరచన చేస్తూ ముందుకు సాగుతున్నారు. నాగార్జునసాగర్ నియోజకవర్గంలో మరోసారి గులాబీ జెండా ఎగుర వేసేందుకు పార్టీ అధినాయకత్వం మార్గదర్శనంలో వచ్చే ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా క్యాడర్ అంతా దూకుడు పెంచింది.



త్రిపురారం మండలం పెద్దదేవులపల్లిలో ఎమ్మెల్యే భగత్ ప్రచారంలో పాల్గొన్న ప్రజలు

### ఖంగుతిన్న కాంగ్రెస్ నాయకులు

నాగార్జునసాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన వరుస సభలకు ప్రజలు వేలాదిగా తరలిరావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఖంగుతిన్నారు. కొంత మంది బీఆర్ఎస్ నాయకులను ప్రలోభాలకు గురిచేసి తమ పార్టీలో చేర్పించుకొని ఇక తామే గెలుస్తున్నామనే వాతావరణం తీసుకొచ్చేందుకు కాంగ్రెస్ నాయకులు తీవ్ర ప్రయత్నం చేశారు. గుర్రంపోడు, హాలియా, తిరుమలగిరి సాగర్ మండల కేంద్రాల్లో సభలు పెట్టి బీఆర్ఎస్ పార్టీకి చెందిన కొంత మందిని పార్టీలో చేర్చుకున్నారు. అయితే ఈ నెల 27న గుర్రంపోడు, 29న హాలియాలో బీఆర్ఎస్ పార్టీ సభలు నిర్వహించగా .. ఒక్కో సభకు 15 వేల మంది ప్రజలు తరలి రావడంతో కాంగ్రెస్ నాయకులు ఖంగుతిన్నారు. కాంగ్రెస్ ప్రలోభాలకు లొంగింది కేవలం కొంత మంది నాయకులు మాత్రమేనని ప్రజలు కాదని ఈ సభల ద్వారా రుజువైంది. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ చేరాయి. ఒక్కో ఇంట్లో రెండు మూడు పథకాల లబ్ధిదారులు సైతం ఉన్నారు. రాబోయే ఎన్నికల్లో ఎమ్మెల్యే నోముల భగత్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు సిద్ధమవుతున్నారు.

### ఎమ్మెల్యే ప్రచారానికి జనమే జనం

సోమవారం మాడుగులపల్లి మండలం, త్రిపురారంలో ఎమ్మెల్యే నోముల భగత్ ప్రచారం నిర్వహించగా ప్రజలు వేలాదిగా తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. పలు గ్రామాల్లో బీఆర్ఎస్ ప్రచారానికి ప్రజలు బ్రహ్మరథం పట్టారు. మంగళహారతులతో ఎదురేగి విజయతిలకం దిద్దుతూ తాము మీవెంటే ఉన్నామంటూ భరోసా ఇస్తున్నారు. చాలా గ్రామాల్లో ప్రజలందరూ ఎమ్మెల్యే నోముల భగత్ వెంటే ఉంటూ ప్రచారంలో పాల్గొంటున్నారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణులు కూడా నోతనోత్సాహంతో ప్రచారంలో దూకుడు ప్రదర్శిస్తున్నారు. అయితే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కుందూరు జయవీర్‌రెడ్డి మాత్రం ఇప్పటి వరకు ప్రచారం కూడా ప్రారంభించలేదు.

# మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

- ఎఫ్‌డీఓ సాల్మన్ రాజు



నిడమనూరు చెరువులో చేపలు వదులుతున్న సాల్మన్‌రాజు

నిడమనూరు, అక్టోబర్ 30 : మత్స్యకారుల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం చెరువుల్లో వేసేందుకు చేపల పిల్లలను ఉచితంగా పంపిణీ చేస్తుందని ఎఫ్‌డీఓ సాల్మన్ రాజు అన్నారు. ప్రభుత్వం వంద శాతం సబ్సిడీపై సరఫరా చేసిన 5,45,200 చేప పిల్లలను ముప్పారం, సోమోరిగూడెం, నిడమనూరు నల్ల చౌట చెరువుల్లో సోమవారం వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రవ్వ, బొచ్చె, పులస చేప పిల్లలను చెరువుల్లో వదిలినట్లు చెప్పారు. మత్స్యకారులు ఉచిత చేప పిల్లలను సద్వినియోగం చేసుకొని జీవనోపాధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో ముప్పారం మత్స్య పారిశ్రామిక సహకార సంఘం చైర్మన్ కోట్ల సైదులు, పంచాయతీ కార్యదర్శి మధుసూదన్, మాజీ చైర్మన్ మంగినపల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు గుండు నర్సింహ, మర్రి లక్ష్మయ్య, దాసరి రాములు, మర్రి శ్రీను, అన్నెబోయిన భీమయ్య, పూస కృష్ణయ్య, స్థానికులు పాల్గొన్నారు.

# జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్య తీసుకోవాలని ధర్నా

హాలియా, అక్టోబర్ 30 : మహిళా అధ్యాపకురాలిని లైంగిక వేధింపులకు గురి చేస్తున్న స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా ఆధ్వర్యంలో సోమవారం కళాశాల ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, ఐద్వా నాయకురాలు కారంపూడి ధనమ్మ మాట్లాడుతూ కళాశాల ప్రిన్సిపాల్ మహిళా అధ్యాపకుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయమై గతంలోనే ఇంటర్‌బోర్డు కార్యదర్శికి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ నెల 29న సదరు అధ్యాపకురాలు హాలియా పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేసిందని పేర్కొన్నారు. ప్రిన్సిపాల్‌ను ఉద్యోగం నుంచి తొలగించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కోరే రమేశ్, ఆలేటి చందు, రేవతి, పూజిత, కలాం, భవాని, కోటేశ్వరి, అంజలి, దివ్య పాల్గొన్నారు.

# అభివృద్ధిని చూసి ఆశీర్వదించండి

- ఎమ్మెల్యే నోముల భగత్‌కుమార్



త్రిపురారం : బాబుసాయిపేట ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నోముల భగత్, పక్కన ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

మాడ్గులపల్లి, అక్టోబర్ 30 : నాగార్జునసాగర్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిరంతరం పాటుపడుతున్నానని.. రాబోయే ఎన్నికల్లో తనను మరో మారు ఆశీర్వదించి అభివృద్ధిని కొనసాగించాలని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ కోరారు. సోమవారం మండలంలోని అభంగాపురం, పూసలపాడు, గజలాపురం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేలా సీఎం కేసీఆర్ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. 50 ఏండ్ల పాటు రాష్ట్రాన్ని, దేశాన్ని పాలించిన కాంగ్రెస్ పార్టీ కనీసం గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేక పోయిందన్నారు. కుందూరు జానారెడ్డి గతంలో అనేక సార్లు ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా పని చేసినప్పటికీ నియోజకవర్గ ప్రజలకు చేసిందేమీలేదన్నారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత నాగార్జునసాగర్‌లో బీఆర్ఎస్ పార్టీ గెలుపొందిన తర్వాతే నాగార్జునసాగర్ నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందన్నారు. ఎన్నికల సందర్భంగా కల్లబొల్లి మాటలతో కాంగ్రెస్ పార్టీ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు యత్నిస్తుందని, ప్రజలు వారి మాయలో పడొద్దన్నారు. రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వచ్చేలా ప్రతి ఒక్కరూ కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు.

### నోముల భగత్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలి : ఎమ్మెల్సీ కోటిరెడ్డి

నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్‌ను నియోజకవర్గ ప్రజలు మరో మారు ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ ఎంసీ. కోటిరెడ్డి అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యానికి నియోజకవర్గం ఎడారిగా మారిందని, స్వరాష్ట్రంలో సీఎం కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే భగత్ కృషితో తిరిగి అభివృద్ధి పథంలో పయనిస్తుందన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఫలాలు ప్రతి ఇంటికీ చేరాయన్నారు. పుట్టిన బిడ్డ నుంచి మొదలు ముసలి వారి వరకు అన్ని వర్గాల ప్రజల కోసం సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని పేర్కొన్నారు. ఆ పథకాలే రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని దీమా వ్యక్తం చేశారు.

### బీఆర్ఎస్‌లో పలువురి చేరిక

అంతకు ముందు అభంగాపురంలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కాంగ్రెస్ పార్టీకి చెందిన 20 మంది కార్యకర్తలు ఎమ్మెల్యే సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి ఎమ్మెల్యే భగత్ గులాబీ కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్, జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాలుట్ల బాబయ్య, జిల్లా కోఆప్షన్ సభ్యుడు మోసిన్‌అలీ, నాయకులు నరేందర్ పాల్గొన్నారు.



మాడ్గులపల్లి :అభంగాపురం గ్రామంలో ఎమ్మెల్యేకు హారతిచ్చి తిలకం దిద్దుతున్న మహిళలు

### బీఆర్ఎస్‌ను గెలిపించి అభివృద్ధిలో భాగస్వాములు అవ్వాలి : ఎమ్మెల్యే భగత్

త్రిపురారం : రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి నాగార్జునసాగర్ నియోజకవర్గ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం మండలంలోని పెద్దదేవులపల్లి, బాబుసాయిపేట, దుగ్గేపల్లి, కామారెడ్డిగూడెం, కంబాలపల్లి, కొణతాలపల్లి గ్రామాల్లో ఎమ్మెల్సీ ఎంసీ.కోటిరెడ్డి, ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్‌తో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైన తర్వాతే నియోజకవర్గం అభివృద్ధి చెందిందని, ప్రతి గ్రామానికి సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం, మౌలిక సదుపాయాలు కల్పించినట్లు చెప్పారు. రైతుబంధు, రైతుబీమా పథకాలతో పాటు వ్యవసాయానికి నిరంతర ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాలు, పండిన ధాన్యం మద్దతు ధరకు కొనుగోలు వంటి వాటితో రైతును రాజుగా చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. సమైక్య పాలనలో త్రిపురారం మండలం అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండేదని, తెలంగాణ ఏర్పాటయ్యాక దివంగత ఎమ్మెల్యే నోముల నర్సింహయ్య రూ.5.70 కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఏనాడూ నియోజకవర్గ ప్రజల బాధలు పట్టించుకోని జానారెడ్డి తన కుమారుడు ఎమ్మెల్యే అని తాను ముఖ్యమంత్రిగా అవుతామంటూ చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ప్రస్తుతం బాబుసాయిపేట గ్రామం వద్ద బ్రిడ్జి నిర్మాణం జరుగుతుందన్నారు. పెద్దదేవులపల్లి గ్రామంలోని కంపెనీలో ఉన్న వారి పింఛన్లు తొలగించగా 730 మందికి ప్రత్యేకంగా పింఛన్లు ఇప్పిస్తున్న ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనన్నారు. కొణతాలపల్లి గ్రామంలో రూ.1.20 కోట్లతో వరదకాల్వ లిఫ్టు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమాన్ని కొనసాగించేందుకు రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి తనను మరో మారు ఆశీర్వదించాలని కోరారు. పెద్దదేవులపల్లి గ్రామంలో యాదవ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే నోముల భగత్‌కు గొర్రెపిల్లను బహూకరించారు. ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి మాట్లాడుతూ దేశంలోనే ఏ రాష్ట్రంలో లేని విధంగా నిరంతర విద్యుత్ అందిస్తున్న రాష్ట్రం తెలంగాణ ఒక్కటే అన్నారు. రాష్ట్రంలో 24గంటల కరెంట్ ఇస్తే గులాబీ కండువా కప్పుకొని బీఆర్ఎస్‌కు ప్రచారం చేస్తానని చెప్పిన జానారెడ్డి మాట తప్పాడన్నారు. అంతకుముందు ఏనాడూ ప్రజల వద్దకు వచ్చి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకోలేని నాయకుడు నేడు ప్రజలను మభ్యపెట్టేందుకు మాయ మాటలు చెబుతున్నాడని, అలాంటి వారి మాటలు నమ్మొద్దని కోరారు.

### కాంగ్రెస్‌ను నమ్మితే అంధకారమే : ట్రైకార్ చైర్మన్ రాంచందర్‌నాయక్

బీఆర్ఎస్ పార్టీ గెలిస్తే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని, కాంగ్రెస్ పార్టీని నమ్మితే రాష్ట్రం మరోసారి అంధకారంలోకి వెళ్తుందని రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్‌నాయక్ అన్నారు. సమైక్య పాలనలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలంతా హైదరాబాద్‌లో ఉంటూ సామాన్య ప్రజలకు దూరమయ్యారన్నారు. కానీ స్వరాష్ట్రంలో ఎమ్మెల్యే నోముల భగత్ నిరంతరం ప్రజల మధ్యే ఉంటూ అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణాలో రెండు పంటలకు నీళ్లు, 24 గంటల విద్యుత్, అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అన్నారు. రాబోయే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి ఎమ్మెల్యేగా భగత్‌కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బహునూతల నరేందర్ అధ్యక్షతన జరిగిన ప్రచార కార్యక్రమంలో జడ్పీ వైస్ చైర్మన్ ఇరిగి పెద్దులు, నిడమనూరు, హాలియా మార్కెట్ కమిటీ చైర్మన్లు మర్ల చంద్రారెడ్డి, జవ్వాజి వెంకటేశ్వర్లు, మహిళాధ్యక్షురాలు మాద ధనలక్ష్మి, ప్రధాన కార్యదర్శులు వెంకటాచారి, వనజ, పీఏసీఎస్ చైర్మన్లు నరేందర్‌రెడ్డి, జయరాంనాయక్, వైస్ చైర్మన్ గుండెబోయిన వెంకన్న, రైతుబంధు సమితి జిల్లా నాయకుడు శ్రీనివాస్‌రెడ్డి, గుండెబోయిన కోటేశ్‌యాదవ్, మాజీ ఎంపీపీ ధూళిపాల రామచంద్రయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జానయ్య, ఎంపీటీసీలు అంబటి రాము, ధనావత్ రవి, డైరెక్టర్లు దైద రవి, తిక్కబోయిన నాగరాజు, షేక్ ఖాసీం, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.



త్రిపురారం : బాబుసాయిపేటలో ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలుకుతున్న స్థానికులు